సాక్షి
నిజామాబాద్
సోమవారం, 11, మార్చి, 2024



ఇరుకు గదుల్లో కార్యాలయం

బాల్కొండలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



ప్రాజెక్ట్‌లో ఇసుక తోడేళ్లు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి మట్టం తగ్గడంతో కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.8 /22.7

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగవచ్చు.

న్యూస్‌రీల్

ఎగుమతుల పెంపుతోనే పసుపు ధర పైపైకి..

- హర్షం వ్యక్తం చేసిన ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా పసుపు ధర క్రమంగా పెరుగుతోందని, ముఖ్యంగా ఎగుమతులు పెంచడం, అదే సమయంలో దిగుమతులను తగ్గించడంతో ధర అమాంతంగా పెరుగుతుందని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. పసుపు రైతులకు మంచి ధర రావడంపై ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తాజాగా సాంగ్లీ మార్కెట్‌లో అంక్సాపూర్‌కు చెందిన పాశపు మహేశ్ పసుపు పంటకు క్వింటాలుకు రూ. 18,900 ధర పలికిందని పేర్కొన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో 2011లో రూ. 16వేలు ధర పలికిందని, ఇప్పుడు ఆల్‌టైం రికార్డు బద్దలు కొట్టి వారం క్రితం రూ. 17,011 ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ తెలంగాణకు పసుపు బోర్డు ప్రకటించారని, కేబినెట్‌లో ఆమోదం పొంది గెజిట్ కూడా విడుదలైన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 1,57,312 ఎకరాల విస్తీర్ణం పెరిగిందని, అయినప్పటికీ అంతర్జాతీయ డిమాండ్ మేరకు పసుపు ధరలు అమాంతంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. నాలుగేళ్లలో పసుపు ఎగుమతులు 1,70,085 టన్నులకు పెరగగా, అదే సమయంలో దిగుమతులు 16,796 టన్నులకు తగ్గిపోయిందని వివరించారు. క్వింటాలుకు రూ. 20వేలు ధర కల్పించి తమ రికార్డును తామే తిరగరాస్తామని స్పష్టంచేశారు.

జాతీయస్థాయి టోర్నీకి జిల్లా క్రీడాకారులు



ఉదయ్‌కిరణ్



స్ఫూర్తి

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్, కార్యదర్శి శ్యామ్ తెలిపారు. జిల్లా నుంచి ఉదయ్‌కిరణ్, స్ఫూర్తిలు ఎంపికయ్యారన్నారు. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వీరి ఎంపికపై వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వీ హనుమంత్ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు కిషన్, కిషోర్, రంజిత్, రాజ్ కుమార్, కోశాధికారి రాజేశ్వర్, కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

తేలిన రామలింగేశ్వర స్వామి గుడి శిఖరం



చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో తేలిన ఆలయ శిఖరం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీలో ముంపునకు గురైన కుస్తాపురం రామలింగేశ్వర స్వామి గుడి శిఖరం ఈ ఏడాది కూడా తేలింది. లిఫ్టుల వినియోగంతో పాటు ఎండల కారణంగా నీటి మట్టం తగ్గడంతో గుడి శిఖరం బయటపడింది. డొంకేశ్వర్ మండలం చిన్నయానం బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఈ గుడి ఉండగా, కొన్నేళ్లుగా ముంపులోనే ఉంది. చివరి సారిగా 2019లో గుడి పూర్తిగా తేలింది. మళ్లీ ఇప్పటి వరకు బయట పడలేదు. ప్రతి ఏడాది మే నెలలో గుడి శిఖరం నీటి నుంచి తేలేది. కానీ, ఈ ఏడాది మార్చి నెలలోనే బయటపడింది. జూన్ నాటికి గుడి పూర్తిగా నీటి నుంచి తేలే అవకాశాలున్నట్లు జాలర్లు, ప్రజలు పేర్కొంటున్నారు. అయితే, జీజీ నడ్కుడకు చెందిన మత్స్యకారుడు చిన్న గంగారాంతో పాటు మరికొందరు జాలర్లు నీటిలో రెండు కిలో మీటర్ల మేర తెప్పపై ప్రయాణించి గుడి శిఖరానికి కొబ్బరికాయలు కొట్టి ఇటీవల శివరాత్రికి పూజలు నిర్వహించారు.



పదేళ్లకు మెరిసిన పచ్చబంగారం..

- పసుపు పంటకు మంచి ధర
- క్వింటాలుకు రూ.16 వేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- సాగు తగ్గడంతో పెరిగిన డిమాండ్

డొంకేశ్వర్(ఆర్మూర్): పదేళ్ల తర్వాత పసుపు పంటకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. ఎకరానికి మూడు నుంచి నాలుగు లక్షల వరకు రైతులు లబ్ధి పొందుతున్నారు. దీంతో ఈ ఏడాది పసుపు రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. అయితే పసుపు సాగు చేసిన వారికి ఎంతైతే సంతోషం ఉందో, సాగు చేయని వారికి కూడా అంతే నిరాశ కలుగుతోంది. కొన్నేళ్లుగా ధర రాకపోవడంతో చాల మంది రైతులు పసుపు పంటకు దూరంగా ఉన్నారు. మార్కెట్‌లో పలుకుతున్న ధరను చూసి ఈ ఏడాది సాగు చేస్తే బాగుండేదనుకుంటున్నారు. ప్రతి ఏడాది ఇలాంటి పరిస్థితులే ఉంటే మళ్లీ పసుపును సాగు చేయాలని కొంతమంది రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం గ్రేడ్–1 పసుపు కొమ్ములు క్వింటాలు రూ.14 వేల నుంచి రూ.16 వేల పైచిలుకు అమ్ముడు పోతున్నాయి. గ్రేడ్–2 రకానికి రూ.9 వేల నుంచి రూ.12 వేల దాకా ధర పలుకుతోంది. మండ పసుపు గ్రేడ్–1 రకానికి రూ.11వేల నుంచి రూ.13 వేలు, గ్రేడ్–2 రూ.8 వేల నుంచి రూ.11 వేల వరకు అమ్ముడు పోతోంది. సరిగ్గా 2011 సంవత్సరంలో పచ్చబంగారానికి క్వింటాలుకు రూ.16,116 ధర పలికింది. మళ్లీ ఇప్పుడు అలాంటి ధరే రావడంతో పసుపు రైతుల దశ ఒక్కసారిగా మారిపోయింది.

ఏడాది వారీగా పసుపు సాగు తీరు..

సంవత్సరం	ఎకరాలు
2018-19	40,890
2019-20	40,624
2020-21	34,369
2021-22	33,836
2022-23	21,913
2023-24	19,000

సాగు, దిగుబడి రెండూ తగ్గాయి

పసుపు పంటను అత్యధికంగా సాగు చేస్తున్న జిల్లాలో నిజామాబాద్ ఒకటి. ఒకప్పుడు యాభై వేల ఎకరాల్లో సాగయ్యే పసుపు రానురాను విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. గత 12 సంవత్సరాలుగా పంటకు ధర రాకపోవడంతో జిల్లాలో 20 వేల ఎకరాలు కూడా సాగవడం లేదు. దీనికి తోడు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంటను తెగుళ్లు ఆశించడం ఒకటైతే, పెట్టుబడి ఖర్చులు కూడా పెరిగిపోవడంతో రైతులు ఈ పంటను దూరం చేస్తూ వచ్చారు. ఈ ఏడాది కూడా 19 వేల ఎకరాలకే సాగు పరిమితమైంది. సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు తెగుళ్లు సోకడంతో దిగుబడి చాలా తగ్గింది. కలిసొచ్చిన రైతులకు ఎకరానికి 25–30 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. సాగు, దిగుబడి రెండూ తగ్గడంతో మార్కెట్‌లో ఈ ఏడాది పసుపునకు డిమాండ్ ఏర్పడింది. దీంతో రైతులకు లాభాలు వచ్చాయి. ఎక్కువ ఎకరాల్లో సాగు చేసిన వారికి కనకవర్షం కురిసింది. ఐతే, వచ్చే ఏడాది పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియవని రైతులు పేర్కొంటున్నారు.

ఊహించలేదు...



గత రెండేళ్లుగా పంట సక్రమంగా దిగుబడి రాలేదు. ఎప్పటికైనా ధర రాకపోతుందా అనే నమ్మకంతో పసుపును సాగు చేస్తున్నా. ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో పంట వేస్తే ఎకరానికి 30 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. కొమ్ము పసుపునకు క్వింటాలు రూ.14,580 పలికింది. మండ పసుపుకు రూ.12,869 వచ్చింది. మంచి ధర రావడం ఆనందంగా ఉంది.

– గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మైలారం

దిగుబడి తగ్గినా రేటు పర్వాలేదు...



ఆనవాయితీగా ప్రతి ఏడాది పసుపును సాగు చేస్తున్నా. కానీ, తెగుళ్ల కారణంగా దిగుబడి 20 ఎకరాలకు పరిమితమైంది. అయినప్పటికీ పంటను మార్కెట్‌లో అమ్మితే పర్వాలేదన్నట్లుగా రేటు వస్తోంది. రానున్న కాలంలో కూడా ఇలాంటి ధరలే నిలకడగా ఉంటే పసుపును ఎక్కువగా సాగు చేయడానికి రైతులు ముందుకొస్తారు.

– చిన్నారెడ్డి, నూత్‌పల్లి, డొంకేశ్వర్ మండలం

అడవికి నిప్పు.. పర్యావరణానికి ముప్పు

- కాలిపోతున్న విలువైన చెట్లు
- అంతరిస్తున్న అడవులు

సిరికొండ: పచ్చని అడవులకు నిప్పు పెడుతుండడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. అటవీ సంపద బూడిదవడంతో పాటు వన్య ప్రాణులకు గ్రాసం కొరత ఏర్పడుతోంది. అటవీ అధికారుల నిర్లక్ష్యంతో అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఈ సమయంలో ఇప్ప చెట్లకు పూత రావడంతో పాటు, బీడీల తయారీకి ఉపయోగించే తునికాకును తెంపుతారు. వీటి కోసం కొందరు అడవులకు నిప్పు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్ప పూతను ఏరుకునేందుకు వీలుగా చెట్ల కింద ఎండిపోయిన ఆకులను కాల్చివేసి ముందస్తుగా చదును చేసుకుంటున్నారు. మరికొందరు అడవిలోని చెత్తాచెదారాన్ని కాల్చి వేస్తే తునికాకు చెట్లు ఏపుగా పెరిగి నాణ్యమైన ఆకులు వస్తాయనే ఉద్దేశంతో నిప్పు పెడుతున్నారు.

విస్తారమైన అడవులు

మండలంలోని సిరికొండ, కొండాపూర్, తూంపల్లి, పాకాల, పందిమడుగు, తాట్‌పల్లి, చీమన్‌పల్లి, గడ్కోల్, రావుట్ల, న్యావనంది గ్రామాల పరిధిలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇప్పుడు ఆకు రాలే కాలం కావడంతో మోడు వారిన చెట్లను నరికి తరలించేందుకు అడవులకు నిప్పు పెడుతున్నారు. విలువైన టేకు చెట్లను నరికేందుకు అనువుగా ఉండేందుకు అడవులను దహనం చేస్తున్నారు. అడవులకు నిప్పు పెడుతుండడంతో మోడు వారిన చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. అడవుల్లో రాలిన ఆకులు కాలుతుండగా వచ్చే వేడికి చెట్లు ఎండిపోయే స్థితికి చేరుతున్నాయి. అలా కాగానే ఆ చెట్లను నరికేసి తరలిస్తున్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణ కాలుష్యం జరుగుతోంది. అడవులను కాపాడాల్సిన అటవీశాఖ సిబ్బంది చోద్యం చూస్తుండడంతో ప్రతి ఏడాది వేసవిలో ఇదే తంతు కొనసాగుతోంది. సిరికొండ, పందిమడుగు, పాకాల, తూంపల్లి, రావుట్ల అటవీ ప్రాంతాల్లో అడవులు ఎక్కువగా కాలిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అగ్ని కీలల ధాటికి ఏపుగా పెరుగుతున్న టేకు, ఇప్ప, తదితర జాతులకు చెందిన చెట్లు మాడిమసవుతున్నాయి. దీంతో అటవీ సంపదకు పెను ముప్పు ఏర్పడుతోంది. అదే విధంగా చిన్న చిన్న మొక్కలు, ఏపుగా పెరిగిన గ్రాసం దహనమైపోవడంతో వన్య ప్రాణులకు మేత కరువవుతోంది. దాంతో అవి అడవిని దాటి వచ్చి వేటగాళ్ల బారిన పడుతున్నాయి. మరోవైపు అడవుల సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని అటవీ అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సిరికొండ శివారులో కాలుతున్న అడవి

తగిన చర్యలు తీసుకుంటున్నాం

అడవుల్లో మంటలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. గొర్రెల కాపరులు ఇతరులు అడవుల్లోకి వెళ్లినప్పుడు బీడీలు చల్లార్పకుండా పడేయడంతో మంటలు అంటుకుంటున్నాయి. ఫైర్ బ్లోయర్ల ద్వారా మంటలను నిరోధిస్తున్నాం.

– ఎంపీ నాయక్, ఎఫ్ఆర్వో సిరికొండ

గ్రామీణుల్లో ఆందోళన

అడవులు అంతరించిపోతుండడంతో వన్యప్రాణులకు తిండి కొరత, నీటి కొరత ఏర్పడుతోంది. దీంతో అవి అనివార్యంగా జనావాసాల వైపు దూసుకువస్తున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలోని గ్రామాల్లోకి చిరుతలు, ఎలుగుబంట్లు సంచరించిన ఘటనలు నెలకొన్నాయి. సిరికొండ బొడ్డు మామిడి చెరువు సమీపంలో ఆవుల మందపై చిరుత దాడి చేసి ఆవును చంపేశాయి. వన్య ప్రాణుల సంచారంతో గ్రామీణులలో ఆందోళన నెలకొంది.

భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

- వేల్పూర్‌లో 120 టన్నులు స్వాధీనం

వేల్పూర్: వేల్పూర్‌లోని వజ్ర రైస్‌మిల్లులో సుమారు 120 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. వేల్పూర్ ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ విష్ణుమూర్తి, వేల్పూర్ పోలీసులు దాడిచేసి రైస్‌మిల్లులో అక్రమంగా దాచిన రేషన్ బియ్యాన్ని శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. రైస్‌మిల్లుపై దాడిచేసే సమయానికి బియ్యం లోడుతో ఉన్న రెండు పెద్ద లారీలు అక్కడ ఉన్నాయి. వీటితో పాటు మరో రెండు లారీల వరకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఉన్నాయి. ఆదివారం ఉదయం సివిల్‌సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి వజ్ర రైస్‌మిల్లుకు వచ్చి రేషన్ బియ్యాన్ని పరిశీలించి అంచనా వేశారు. పట్టుకున్న బియ్యం సుమారు 120 టన్నులు ఉంటుందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మాక్లూర్‌లోని సాయికృష్ణ రైస్‌మిల్లుకు తరలించి అక్కడ తూకం వేయిస్తామన్నారు. రైస్‌మిల్లు యజమాని సాయికృష్ణగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఓఎస్డీ వెల్లడించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్లు వినోద్, శ్రీనివాస్, వీడీఆర్ఐ మహేశ్, వేల్పూర్ ఆర్ఐ వేణు ఉన్నారు.

పనిచేయని రైస్‌మిల్లులో అక్రమదందా

వజ్ర రైస్‌మిల్లు చాలా ఏళ్లుగా పనిచేయడం లేదు. దీంతో మిల్లు, బియ్యం నిల్వకోసం నిర్మించిన పెద్ద షెడ్లు ఖాళీగా ఉన్నాయి. అందులో వీఆర్ అగర్‌బత్తి పేరుతో అగర్‌బత్తీలు తయారు చేస్తూ ఓపెన్ ఉంచారు. బియ్యం లారీలు నేరుగా షెడ్లలోకి వెళ్లేంత విశాలంగా ఉన్నాయి. దీంతో రాత్రి సమయంలో దూరప్రాంతాల నుంచి రేషన్‌బియ్యం తీసుకువచ్చే లారీలు ఎవరి కంట పడకుండా షెడ్లలోకి వెళ్తాయి. యంత్రాల ద్వారా రీసైక్లింగ్ చేసి, తిరిగి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.



వేల్పూర్ వజ్ర రైస్‌మిల్లులో పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం

సమాజ పరివర్తనే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం



మాట్లాడుతున్న శివకుమార్



సూర్య నమస్కారాలు చేస్తున్న స్వయం సేవకులు

సుభాష్‌నగర్: సమాజం, వ్యక్తి పరివర్తన కోసం ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని, అందులో అందరినీ భాగస్వాములను చేసి మన మాతృభూమి వైభవానికి కృషి చేద్దామని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ శివకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శాఖా సంగమం నిర్వహించారు. నగరంలోని 36 బస్తీలకు చెందిన సుమారు వెయ్యి మందిపైగా స్వయం సేవకులు శాఖా సంగమంలో పాల్గొన్నారు. స్వయంసేవకుల దండ విన్యాసాలు, పథ సంచలనం, యోగాసనాలు, ఆటలు ఆకట్టుకున్నాయి. అనంతరం నర్రా వెంకట శివకుమార్ మాట్లాడుతూ సంఘం దేశంలో ఒక తపస్సు కొనసాగిస్తోందని, సమాజ మార్పునకు సంఘటిత మార్గం తప్ప మరో మార్గంలేదన్నారు. వ్యక్తి పరివర్తన కోసం నిత్య శాఖ, వ్యవస్థ పరివర్తన కోసం వివిధ క్షేత్రాలు, విద్యార్థి దశలో ఏబీవీపీ, కార్మిక రంగంలో బీఎంఎస్, కర్షక రంగంలో బీకేఎస్, ఇలా 40కిపైగా వివిధ రంగాల్లో ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని తెలిపారు. శ్రేష్ఠ సమాజ నిర్మాణానికి 99 ఏళ్ల తపస్సు ఈ శాఖ అని, ఆర్‌ఎస్‌ఎస్‌లో భాగస్వాములను చేసి మాతృభూమి వైభవానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జాతీయతా భావాలు పెంపొందించడంలో, కలియుగంలో ధర్మాన్ని రక్షించే ధర్మ రక్షకులను తయారు చేయడంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో దేశ భక్తి, జాతీయతా భావాలు పెంపొందించాలంటే తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను సంఘ శాఖకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో నగర సంఘ చాలక్ తిరుక్కోవల్లూరు శ్రీనివాస్, నగర కార్యవాహ అర్గుల సత్యం, విభాగ కార్యవాహ దిగంబర్ జీ, బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, ఇల్లెందుల మమత ప్రభాకర్, నాయకులు శివనూరి భాస్కర్, హరీశ్‌రెడ్డి, చింతకాయల రాజేందర్, పుట్ట వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.



వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

'సాదాబైనామాల'కు మోక్షమెప్పుడో..!

- యాజమాన్య హక్కులు కల్పించాలంటున్న బాధితులు
- చట్టబద్ధత కల్పించడంలో జాప్యం
- మూడేళ్ల కింద దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 25,345 దరఖాస్తులు

మోర్తాడ్: మోర్తాడ్ మండలం వడ్యాట్‌కు చెందిన నవ్యశ్రీ ఒక రైతు వద్ద రెండు ఎకరాల వ్యవసాయ భూమిని 2013లో కొనుగోలు చేసి సాదా కాగితంపై విక్రయ ఒప్పంద పత్రం రాసుకున్నారు. 2020లో సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించడానికి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. రిజిస్ట్రేషన్ చార్జీలు కలిసి వస్తాయనే ఉద్దేశంతో నవ్యశ్రీ సాదాబైనామా కింద దరఖాస్తును సమర్పించారు. ఇప్పటికీ నవ్యశ్రీ సాదాబైనామా దరఖాస్తు పెండింగ్‌లోనే ఉంది. వ్యవసాయ భూముల క్రయ విక్రయాలకు సంబంధించి సాదాబైనామాలు రాసుకున్నవారు తక్కువ రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లిస్తే అలాంటి భూములకు చట్టబద్ధత కల్పిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ తన ఎన్నికల మెనిఫెస్టోలో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులను కల్పిస్తామని.. ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో సాదాబైనామాలకు యాజమాన్య హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఆశలు పెంచుకున్నారు. తాజాగా గ్రామాల్లో ధరణి సమస్యలపై సదస్సులను రెవెన్యూ యంత్రాంగం నిర్వహిస్తోంది. కార్యక్రమంలో సాదాబైనామాల అంశాన్ని ప్రస్తావించకపోవడంతో దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చార్జీల భారం తప్పించడానికి అనేక విడతల్లో సాదాబైనామా విధానం అమలు చేశారు. చివరి సారిగా 2020లో సాదాబైనామాలకు దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించడంతో జిల్లాలో 25,345 వినతులు అందాయి. సాదాబైనామాలకు యాజమాన్య హక్కును కల్పించడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో తహసీల్దార్ కార్యాలయాల్లో వేల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. 2019లో రెవెన్యూ చట్టాన్ని సవరించడంతో సాదాబైనామాలకు చట్టబద్ధత ఎలా కల్పిస్తారని కోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందించిన ప్రభుత్వం చివరిసారిగా సాదాబైనామాలకు అవకాశం కల్పించాలని విన్నవించింది. ఇందుకు అనుగుణంగా మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉండగా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రక్రియను ముందుకు తీసుకెళ్లకపోతే కనీసం రిజిస్ట్రేషన్ చేసి మ్యుటేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఏళ్లతరబడి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం వల్ల వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వారు పంట రుణాలు, రైతుబంధు, రైతుబీమా పథకాలకు దూరం అవుతున్నారు. ప్రభుత్వం స్పందించి సాదాబైనామాల సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం





నారాయణ, విజయ్ మృతదేహాలు



విషాదవదనంలో మృతుల కుటుంబ సభ్యులు

వర్ని: నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మండలంలోని అఫంది ఫారంనకు చెందిన ఇద్దరు, చందూరుకు చెందిన ఒకరు శనివారం నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. వీరిలో ముగ్గురి మృతదేహాలను ఆదివారం పోలీసులు గుర్తించారు. అఫంధి ఫారానికి చెందిన మోచి విజయ్(50), నారాయణ(20), చందూర్‌కు చెందిన విష్ణువర్ధన్(25) మృతదేహాలను కనుగొన్నట్లు వర్ని ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. చందూర్ శివారులో సాగర్ ప్రధాన కాలువలో విజయ్, విష్ణువర్ధన్ మృతదేహాలను, 38వ డిస్ట్రిబ్యూటరీలో నారాయణ మతదేహాన్ని కనుగొన్నట్లు చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. అఫంధి ఫారం, చందూర్ గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో విషాదఛాయలు

సాగర్ కాల్వలో పడి గల్లంతైన వారు మృత్యువాత పడడంతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



ఖలీల్ వాడి: తెలంగాణ మాజీ కేంద్ర పోలీస్ దళ సిబ్బంది సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ కార్యదర్శి మామిళ్ల రాజు ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కొరువ రమేశ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా గంగాప్రసాద్, కోశాధికారిగా తులసీప్రసాద్రెడ్డి ఎన్నిక అయ్యారు. నూతన కమిటీ మాజీ కేంద్ర ఆర్మ్ పోలీస్ ఫోర్సెస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తుందని మామిళ్ల రాజు పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ అడ్వైజర్ కమిటీ సభ్యులు బడుగు స్వామి, లక్ష్మీనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి మగ్గం వర్క్, ఉమెన్స్ టైలరింగ్ ఉచిత శిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు మహిళలు అర్హులని, శిక్షణ కాలంలో భోజనం, హాస్టల్ వసతి ఉచితంగా ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రంతోపాటు టూల్ కిట్‌ను అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏటీఎం ధ్వంసం



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌లో కెనరా బ్యాంక్ ఏటీఎంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎస్సై సాయికుమార్ ఆదివారం తెలిపారు. డబ్బులు విత్‌డ్రా అవకపోవడంతో బ్యాంక్ ప్రధాన కార్యాలయం అధికారులు మేనేజర్ అభినయకుమార్ సింగ్‌కు సమాచారం అందించారు. ఆయన వెళ్లి పరిశీలించి ఏటీఎం స్క్రీన్, వెనుకభాగం ధ్వంసమైనట్లు గుర్తించారు. వెంటనే తమకు సమాచారం అందించగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విజయ సంకల్పయాత్రను సక్సెస్ చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ఈనెల 12వతేదీన హైదరాబాద్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో జరుగు విజయ సంకల్పయాత్రను సక్సెస్ చేయా లని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిరాంరెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని కన్‌కల్‌లో ఆదివారం జరిగిన మెహెర్‌బాబా వార్షిక ఉత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీజేపీ తరఫున బీబీపాటిల్‌ను మొదటి విడతలో ప్రకటించడం హర్షనీయ మన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రిబాపురెడ్డి మా ట్లాడుతూ సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో 12వ తేదీన జరుగే సోషల్ మీడియా ప్రతినిధుల సభను కూడా విజయవంతం చేయాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రావు, నాయకులు సంతోష్‌రెడ్డి, లింగారావు, రవిందర్‌రావు, శ్రీనివాస్, రాజిరెడ్డి, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఇరుకు గదుల్లో ఇరిగేషన్ కార్యాలయం

- సొంత భవనం లేక ఇబ్బందులు
- నిధులు మంజూరై రద్దయిన వైనం



సన్నిహితలో కొనసాగుతున్న ఇరిగేషన్ కార్యాలయం

బాల్కొండ: ఇరిగేషన్ కార్యాలయానికి సొంత భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాగునీటిలో ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దని నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం 2021లో నిర్ణయించింది. కానీ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించడం మరిచింది. దీంతో నాటి నుంచి అద్దె భవనాలు, ప్రభుత్వ, ఇతర కార్యాలయ భవనాల్లో వీటి నిర్వహణ కొనసాగుతోంది. దీంతో ఇరిగేషన్ కార్యాలయానికి పక్కా భవనం లేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో మైనర్ ఇరిగేషన్ డివిజన్–4 కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఈఈ, ఇద్దరు డిప్యూటీ ఈఈలు, ఎనిమిది మంది ఏఈఈలు, సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నారు. కానీ కార్యాలయానికి ఇప్పటి వరకు పక్కా భవనం లేదు. దీంతో తహసీల్ కార్యాలయ సన్నిహిత భవనంలో గత మూడేళ్లుగా కొనసాగుతోంది. పక్కా భవనం కావాలని కొంత కాలంగా అధికారులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నా మోక్షం లభించడం లేదు.

ఇబ్బందుల్లో అధికారులు

ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం నిర్వహిస్తున్న సన్నిహిత భవనం ఇరుకుగా ఉంది. దీంతో అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫైళ్లు ఎక్కడ భద్ర పర్చాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో 10 రోజుల క్రితం సమీపంలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంగా గతంలో నిర్వహించిన గదిని కూడా తీసుకున్నారు. కానీ అది సరిపోవడం లేదు. కార్యాలయానికి కావాల్సిన ఫర్నిచర్‌ను ప్రభుత్వం మంజూరు చేసి పంపింది. ప్రస్తుతం ఆ సామగ్రి కూడ అందులోనే భద్రపరచాల్సి వస్తోంది. దీంతో మరింత ఇరుకుగా మారింది.

గతంలో రూ. 10 లక్షలు మంజూరు..

మండల కేంద్రంలో 2014లో ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10 లక్షలు మంజూరు చేసింది. కార్యాలయ భవన నిర్మాణ పనులు పిల్లర్లు, బేస్‌మెంట్ స్థాయి వరకు కొనసాగాయి. కాంట్రాక్టర్ మృతి చెందడంతో పనులు అటకెక్కాయి. నాటి నుంచి నేటి వరకు పనులు మాత్రం జరగడం లేదు. దీనికి సంబంధించిన నిధులు సైతం రద్దు అయినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

బాల్కొండ మండల కేంద్రంలో ఇరిగేషన్ కార్యాలయ భవనం నిర్మించాలని ఉన్నత అధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉంటున్న భవనంలో ఇరుకుగా ఉంది. సామాగ్రి ఎక్కడ పెట్టాలో తెలియడం లేదు.

– సురేశ్, డిప్యూటీఈఈ, బాల్కొండ

గిరిజనులపై అర్వింద్‌ది కపటప్రేమ

- బంజారాలకు బీజేపీ చేసింది శూన్యం
- కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి విమర్శ



మాట్లాడుతున్న ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి

ఖలీల్‌వాడి: రాజకీయ లబ్ధి కోసమే ఎంపీ అర్వింద్ గిరిజనులపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి స్వార్థ రాజకీయాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ఆదివాసీ, గిరిజన, ఎరుకల కార్పొరేషన్లు తీసుకువస్తుందన్నారు. అసైన్డ్ భూములు, పోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ, గిరిజన సోదరులు కాంగ్రెస్ పక్షాన నిలుస్తారనే భయంతో రామారావు మహరాజ్ విగ్రహాలను ఎంపీ అర్వింద్ పంపిణీ చేశారని ఆరోపించారు.

ఎంపీకి గిరిజనులపై ప్రేమ ఉంటే కేంద్రంతో మాట్లాడి ప్రతి తండాలో రామారావు మహరాజ్ ఆలయాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బంజారాల గురువైన రామారావు మహారాజ్ ఆశీర్వాదం తీసుకొని 2019 ఎన్నికల్లో గెలిచిన అర్వింద్.. గిరిజనుల అభ్యున్నతికి ఏనాడూ కృషి చేయలేదని, గిరిజనుల పక్షాన నిలబడలేదని విమర్శించారు. రాజకీయాల కోసం రామారావు మహరాజ్ పేరును వాడుకోవడాన్ని గిరిజన, ఆదివాసీ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. బంజారాలను నిర్లక్ష్యం చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు పట్టిన గతే ఎంపీ అర్వింద్‌కు పడుతుందన్నారు.

రిజర్వేషన్లు పెంచాలి

ఎస్టీ రిజర్వేషన్‌ను 10 శాతం నుంచి 12 శాతానికి పెంచాలని, ఎస్సీ, ఎస్టీ పోస్టులను కేంద్రంలో భర్తీ చేయాలని యాదగిరి డిమాండ్ చేశారు. హైకోర్టులు, సుప్రీం కోర్టులో గిరిజనులను న్యాయమూర్తులుగా నియమించాలన్నారు. కేంద్రం గిరిజనుల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో విఫలమైందని, దొంగ ప్రేమను నమ్మి గిరిజనులు మోసపోవద్దని కోరారు. సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, తారాచంద్ నాయక్, ప్రకాశ్‌నాయక్, రవినాయక్, సూర్యానాయక్, వెంకట్రామ్‌నాయక్, శ్రీను, నరేందర్, మోతీలాల్, ఎస్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

‘రుబాయిరాగాలు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గజల్ కవి సూరారం శంకర్

నిజామాబాద్ సిటీ: మూడు దశాబ్దాలుగా సాహిత్య కృషి చేస్తున్న ప్రముఖ కవి డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు ‘రుబాయిరాగాలు’ పుస్తకం తీసుకురావడం చాలా ప్రత్యేకమైనదని ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ అన్నారు. సభాసామ్రాట్ వీసీ చందన్‌రావు అధ్యక్షతన నగరంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు సంఘంలో డాక్టర్ కాసర్ల రచించిన ‘రుబాయిరాగాలు’ పుస్తక పరిచయసభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే ఈ రుబాయి ప్రక్రియలో వచ్చిన తొలిపుస్తకం ‘రుబాయిరాగాలు’ అని, దీనిని తెలంగాణ సాహిత్యానికి అందించిన కాసర్ల అభినందనీయుడని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన సెంట్రల్ యునివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ త్రివేణి మాట్లాడుతూ.. కమనీయ కవిత్వాన్ని అందించిన కాసర్ల రుబాయిలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. గిరిరాజ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బోయిన్‌పల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇందూరు జిల్లా కవిత్వంలో నరేశ్ మణికిరీటధారి అని, మంచి కవితలు రాస్తూ కవనకిరీటి అందుకే అయ్యాడన్నారు. అనంతరం ఇందూరు యువత కార్యవర్గ సభ్యులు రుబాయిరాగాలు ముఖపుస్తక కర్త సూరారం శంకర్‌ను, అతిథులను, కాసర్ల కవిని ఘనంగా సన్మానించారు. కవులు పంచరెడ్డి లక్ష్మణ్, ప్రముఖకవి, చిత్రకారుడు చింతల శ్రీనివాస్‌గుప్తా, ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు, కవి డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, దారం గంగాధర్, బలాష్ట్ మల్లేశ్, గంట్యాల ప్రసాద్, రాంనరేశ్, డాక్టర్ శారద, కందకుర్తి ఆనంద్, వసంత లక్ష్మణ్, గణపురం వెంకటేశ్, అల్గోట్ గంగాధర్, సమత, స్వప్న, ఇందిర, మల్లవరపు చిన్నయ్య, ధనుంజయ, సారాపురం సురేందర్, పి లక్ష్మణ్, పురుషోత్తమాచార్య, గుండారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అమర్‌నాథ్, ఉపాధ్యాయులు లాటికర్ రాము, రాజేందర్, కృష్ణారెడ్డి, గీతాంజలి, పద్మావతి పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణకు ‘కావ్య ప్రాణ్’ పురస్కారం



నిజామాబాద్ సిటీ: అయోధ్యలో నిర్వహించిన అఖిల భారత కవి సమ్మేళనంలో నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ కవి శ్రీమన్నారాయణాచార్య విరాట్ ‘కావ్య ప్రాణ్’ పురస్కారం అందుకున్నారు. జిజ్ఞాస సంస్థ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చారుశీల ఆశ్రమ పీఠాధిపతి 1008 అవద్ భూషణ్‌దాస్ శ్రీమన్నారాయణాచార్యకు పురస్కారం అందజేసి సన్మానించారు. కవిసమ్మేళనంలో శ్రీమన్నారాయణ గత వేయి సంవత్సరాల రాముని ఆగమనం ప్రతీక్షని, వేదనని ఓజస్వి కవితా పఠనం చేయగా, శ్రోతలు నినాదాలు చేస్తూ ప్రశంసలతో ముంచెత్తారు. జాతీయస్థాయిలో ప్రదానం చేసే ‘కావ్య ప్రాణ్’ పురస్కారం తనకు అందజేసిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మిథిలా ఆశ్రమ మహంత్ అంజనీకుమార్ శరణ్, సుకృతాల్ ఆశ్రమ మహంత్‌స్వామి కృష్ణానంద్, జిజ్ఞాస జాతీయ అధ్యక్షుడు అనీల్ శర్మ అనంత్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రియ, సంజీవ్ సమర్థ్, అయోధ్య సాధువులు, సాహిత్య ప్రియులు, నాయకులు, అయోధ్య సందర్శన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నట్లు విరాట్ తెలిపారు.

ప్రాజెక్టులో ఇసుక తోడేళ్లు



రివిట్‌మెంట్ అంచున ఇసుక తోడిన దృశ్యం



వాహనాల రాకపోకల కోసం తయారు చేసిన రోడ్డు

- ఎస్సారెస్పీలోకి భారీ వాహనాలు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ఆనకట్టకు ప్రమాదమని తెలిసినా పట్టించుకోని అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం తగ్గడంతో ఇసుకను తోడేస్తున్నారు. ప్రాజెక్టులోకి భారీ వాహనాలు ప్రవేశిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రాజెక్ట్ నీటి మట్టం గణనీయంగా తగ్గిపోవడంతో ఆనకట్ట వైపు అలలకు భారీగా ఇసుక కొట్టుకు వచ్చింది. దీంతోపాటు రివిట్‌మెంట్‌లోని ఇసుక సైతం అలలకు బయటకు వచ్చింది. వరద కాలువ జీరో పాయింట్ నుంచి నేరుగా ప్రాజెక్ట్‌లోపలికి వాహనాలను దించి ఇసుకను తరలిస్తున్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లోపలి వైపు ఆనకట్టను ఆనుకుని ఉన్న ఇసుకను తరలిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వచ్చినప్పుడు పెద్ద ఎత్తున అలల కారణంగా ఆనకట్టపై ఒత్తిడి పడుతుంది. అయితే, ఇసుకను ఇష్టారీతినా తోడేయడం కారణంగా నీటి ఒత్తిడికి ఆనకట్టకు గండిపడే ప్రమాదం ఉంది. ఈ విషయం తెలిసి అధికారులు పర్యవేక్షించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాజెక్టు ముఖం చూడని లష్కర్లు

ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. వారిలో నుంచి 11 మందిని లష్కర్లుగా ప్రాజెక్టు వద్ద విధులు నిర్వర్తించేందుకు నియమించింది. ప్రాజెక్టుకు రక్షణగా ఉండాల్సిన లష్కర్లను గ్రామ పంచాయతీ వివిధ పనులకు వాడుకుంటోంది. దీంతో వారు ప్రాజెక్టు ముఖం చూడడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి లష్కర్లకు ప్రాజెక్టు వద్ద విధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

మొరం తవ్వకాలు షురూ అయ్యే అవకాశం..

ప్రాజెక్టు నీటిమట్టం తగ్గడంతో బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో ఇసుకతోపాటు మొరం తవ్వకాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రాజెక్టు చుట్టూ, ప్రాజెక్టుకు సంబంధించిన భూముల్లో అనేక ఇటుక బట్టీలు వెలిశాయి. వీటికోసం వందల సంఖ్యలో వాహనాల్లో మొరం తరలిస్తారు. ఒక్క ట్రాక్టర్ నల్లమట్టిని తీసుకెళ్తే రైతులపై కన్నెర్ర చేసే అధికారులు.. ప్రాజెక్టులో నుంచి మొరం, ఇసుక యథేచ్ఛగా తరలిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తారనే ఆరోపణలున్నాయి. మొరం తవ్వకాల కారణంగా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులు మృత్యువాతపడుతున్నారు. గత రెండు రోజుల క్రితం ముగ్గురు యువకులు ప్రాజెక్ట్‌లో మునిగి అలాంటి ప్రాంతంలోనే మృతి చెందారు. ఉన్నతాధికారులు స్పందించి మొరం, ఇసుక దందాను అడ్డుకుంటేనే ప్రాజెక్టుకు భవిష్యత్ ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

చర్చనీయాంశమైన విగ్రహాల తొలగింపు

బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని పురాతన మారుతి మందిరంలో ఉన్న శివలింగం, నంది విగ్రహాల తొలగింపు అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఏళ్లుగా పూజలందుకుంటున్న శివలింగం, నంది విగ్రహాలను తొలగించి ఆలయం వెనుకభాగంలోని చెట్టు కింద నిర్లక్ష్యంగా పెట్టేశారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక ఆలయంలోని విగ్రహాలను తొలగించే ముందు పట్టణ పెద్దలు, భక్తుల అభిప్రాయాలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో 6(బీ) కేటగిరిలో ఉన్న ఆలయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై ఇన్‌చార్జి ఈవో రవీందర్‌ను వివరణ కోరేందుకు ఆదివారం రాత్రి ‘సాక్షి’ ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

క్రైం కార్నర్

మానసిక వేదనతో రైతు ఆత్మహత్య

- మూడు బోర్లు తవ్వించినా దక్కని ఫలితం
- పేరుకుపోయిన అప్పులు
- పొలంలోని చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం

భిక్కనూరు: వ్యవసాయభూమిలో మూడు బోర్లు తవ్వించినా నీళ్లు పడకపోవడం, బోర్లు తవ్వించేందుకు చేసిన అప్పులు పెరిగిపోవడంతో మానసిక వేదనకు గురైన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర నర్సింలు(43) మూడు నెలలక్రితం తన పొలంలో మూడు బోర్లను తవ్వించాడు. నీళ్లు పడకపోగా, వాటికోసం చేసిన అప్పులు పేరుకుపోయి తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సింలు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. తన వ్యవసాయ భూమిలోని చెట్టుకు నర్సింలు ఉరేసుకున్నట్లు ఆదివారం ఉదయం గుర్తించిన పలువురు అతడి కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేబుల్ దొంగలకు దేహశుద్ధి

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బోరు బావులవద్ద నుంచి విద్యుత్ కేబుళ్లను దొంగిలిస్తున్న ఇద్దరిని రైతులు ఆదివారం పట్టుకుని దేహశుద్ధి చేశారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు కేబుళ్లను దొంగిలించి అమ్ముకుంటున్నట్లు అనుమానించిన రైతులు వారి ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చితకబాదారు. అనంతరం నిందితుల ఇళ్లలో వెతుకగా మరిన్ని విద్యుత్ కేబుళ్లు లభించడంతో వారిని పోలీసులకు అప్పగించారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత



రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొతంగల్ మండలం హెగ్డోలి గ్రామ శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం తెల్లవారు జామున హెగ్డోలి శివారుకు వెళ్లగా ఇసుక తరలిస్తున్న వాహనం పట్టుబడిందన్నారు. రెవెన్యూ శాఖ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు దాటుతున్న మహిళలను ఢీకొట్టిన బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు

ఎడపల్లి (బోధన్): రోడ్డు దాటుతున్న ఇద్దరు మహిళలను బైక్ కొట్టడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ పట్టణానికి చెందిన నాగమణి, అబ్బవ్వ ఎడపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో మండల కేంద్రంలోని రిక్వెస్ట్ స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా.. బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగమణికి తీవ్ర గాయాలు కాగా, అబ్బవ్వ పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న సీఐ కృష్ణ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామ శివారులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ కాయిల్స్ ఎత్తుకెళ్లారు. రైతులు ఆదివారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ట్రాన్స్‌కో ఏఈ అనిల్, సీఐ కృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి సుమారు రూ.3లక్షల సొత్తు చోరీ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. బోర్లం, బాన్సువాడ రోడ్లలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ అన్నారు. పంటలు ఎండిపోకుండా త్వరగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నర్సింహులు, విఠల్‌రెడ్డి, అహ్మద్ తదితరులు ట్రాన్స్‌కో అధికారులను కోరారు.

రెండు కార్లు ఢీ

- ఇద్దరికి గాయాలు



ఘటనాస్థలంలో ధ్వంసమైన కార్లు

ఎడపలి(బోధన్): మండల కేంద్రంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీకి చెందిన అబ్దుల్ సలాం తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వస్తున్నాడు. 7.30 సమయంలో ఎంఎస్‌సీఫారం వద్ద రోడ్డు దాటగానే బోధన్ వైపు నుంచి వస్తున్న కారు డివైడర్‌ను ఢీ కొట్టి ఎగిరి అబ్దుల్ సలాం కారు బానెట్‌పై పడింది. ఈ ఘటనలో సలాంకు స్వల్ప గాయాలుకాగా, అతడి అన్నయ్య నుదుటిపై, కుడిచేతికి గాయాలయ్యాయి. సలాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

ఎడపల్లి(బోధన్): పెళ్లయి విడాకులు కావడంతో మండల కేంద్రానికి చెందిన కంటెడి రాహుల్(25)మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. డ్రైవర్‌గా పనిచేసే రాహుల్ ఈనెల 8వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఎడపల్లి గ్రామ పులి చెరువులో అతడి మృతదేహం లభించింది. మృతుడి తల్లి కంటెడి శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు..



కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి – ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో రైలు పట్టాలపై ఓ మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై తావునాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 70 నుంచి 75 సంవత్సరాల ఉంటుందని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఒకరి అదృశ్యం



గంగారాం (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మంగ్లారం గంగారాం (63) అదృశ్యమైనట్లు ఎస్సై రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన గంగారాం తిరిగి రాలేదని, కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

- మరో పెళ్లి చేసుకుంటున్నాడని ఆవేదన
- ఇరు కుటుంబాలకు పోలీసుల కౌన్సిలింగ్



కుటుంబ సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట బైఠాయించిన శివాని

కామారెడ్డి క్రైం: అదనపు కట్నం కోసం వేధించడంతోపాటు తనకు తెలియకుండా మరో పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఓ మహిళ తన భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే కామారెడ్డి పట్టణంలోని భవానీనగర్ కాలనీకి చెందిన వడ్ల కార్తీక్‌కు సిరిసిల్లకు చెందిన శివానితో 2019లో వివాహమైంది. పెళ్లిసమయంలో శివానీ కుటుంబ సభ్యులు కార్తీక్‌కు రూ.5లక్షల నగదుతోపాటు 15తులాల బంగారాన్ని కట్నంగా ఇచ్చారు. కొద్ది రోజులకే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రాగా, గర్భిణీగా ఉన్న శివానీని కార్తీక్ ఆమె తల్లిగారింటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. పాప పుట్టిన తరువాత పెద్ద మనుషుల సమక్షంలో రాజీకుదిర్చగా హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. మరో 6 నెలల గడిచిన తరువాత రూ.10 లక్షలు అదనపు కట్నం తేవాలని శివానీని వేధించడం మొదలు పెట్టిన కార్తీక్.. శివానీని మళ్లీ తల్లి గారి ఇంటి వద్ద వదిలేసి వెళ్ళిపోయాడు. వారి మధ్య గొడవలు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్లాయి. ఈ క్రమంలో కార్తీక్ మరో పెళ్ళికి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలుసుకున్న శివాని.. తన మూడేళ్ల కుమార్తె, తల్లిదండ్రులు, సోదరునితో కలిసి ఆదివారం కామారెడ్డికి వచ్చింది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. తమకు కార్తీక్ వచ్చి తీవ్రంగా కొట్టి వెళ్లిపోయాడని శివానీ కుటుంబ సభ్యులు ఆరోపించారు. పట్టణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఇరు కుటుంబాల సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.